

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



## - ఏడవ కథ -

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

నాకేం మాట్లాడాలో తెలియలేదు. ఆయన అన్న మాటలు  నేను సరిగ్గానే విన్నానా? ఏమైనా పొరపాటు పడ్డానా.

ఒకవేళ నేను  నిలదీస్తే 'అబ్బే ఛీ, నేనలా అనలేదమ్మా , ఓహో మీరలా అర్థం చేసుకున్నారా?   అలా ఎలా అనుకున్నారండీ, మీరిలా మాట్లాడతారని కలలో కూడా ఊహించలేదు సుమండీ" అని మాట  తిప్పేసుకుని,  నా మీదే ఎదురుదాడి చేసేవాళ్ళను చూస్తూనే వున్నాను.

"అయినా ఈ నెల ప్రొసీజర్ చేశాముకదా, కొంచం వెయిట్ చెయ్యండి."

"నిన్న పరీక్ష చేశారట కదా, ప్రెగ్నన్సీ లేదని వచ్చిందటగా ! స్వీటీ బాధ పడుతోంది."

" మరీ ఎర్లీగా చేశాం.  యూరిన్ టెస్ట్ ఒక వారం ఆగి చేస్తే బాగుండేది. ఒక్కోసారి మరీ ముందుగా చేసినా నెగటివ్ వస్తుంది."

"ఆ..... నా బొంద. అయిదునెలలు చూశాంగా. ఇంక ఈ నెల సక్సెస్ అవుతుందంటావా? నే జెప్పినట్టు…"

అప్పటి వరకూ గట్టిగా టేబిల్ అంచు పట్టుకున్నందుకేమో, చేతుల్లో సత్తువ పోయినట్లనిపించి వదిలేశాను.

"అలా చెయ్యకూడదు. అనెతికల్"

" డోనార్ ఇన్ సెమినేషన్ ఎతికలే కదమ్మా. "

ఆవేశం పక్కన బెట్టి రూల్స్ మాత్రమే చెప్తున్నాను.

"డోనార్ ఎవరో పేషంటుకూ, పేషంటెవరో డోనార్ కూ తెలియడం మంచిది కాదు."

"అందుకేగా తెలియకుండా చేద్దాము. నేనెటూ చెప్పను. నువ్వూ చెప్పవు. ఇక తెలిసేదెక్కడ."

ఆయనతో పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నానిపించింది.

ప్రాక్టీసు పెట్టిన కొత్తల్లో అయితే 'ఒరే దరిద్రుడా, నువ్వు మనిషివేనా. ఫో అవతలకి .  మళ్ళీ వచ్చావంటే కాళ్ళిరగ్గొడతా!' అనేసేదాన్ని.

***వయసు పెరిగే కొద్దీ ఓర్పు అనే ప్రమాదకరమైన జబ్బొస్తుంది.*** నామీద నాకే చిరాకొచ్చేసింది.

"అవన్నీ కుదరవు. ..... " అంటూ లేచి నిల్చున్నాను.

నేను నిలబడడం చూసి ఇంకేదో అనుకుని " పర్లేదులే! బయటిదాకా ఏమొస్తావు. నే వెళ్తాగా, పేషంట్లు కూడా ఉన్నట్టున్నారు." అని వెళ్ళిపోయాడు.

★★★★★★★

ఆ తర్వాత మళ్ళీ ఎవరూ నాదగ్గరకు రాలేదు. ఆ అమ్మాయిని ఎక్కడెక్కడ తిప్పుతున్నారో?

కొన్నాళ్ళకు తప్పనిసరిగా వెళ్ళాల్సిన వోణీల ఫంక్షన్ పిల్లలతో కలిసి వెళ్ళాను.

ఓ రౌండ్ టేబిల్ దగ్గర నేనూ , మా పిల్లలూ కూర్చున్నాం.

"అమ్మా,బాబుగాడికి పంచల ఫంక్షన్ చేద్దామా?" అడిగింది వాణ్ణి ఏడిపించే అవకాశం ఎక్కడ దొరికినా , వెంటనే అందిపుచ్చుకునే మా అమ్మాయి.

పిల్లాడు "నాకొద్దు, ఛీ నాకొద్దు, నేను జేసుకోనూ" ఏడుపు మొదలెట్టాడు.

“సరే సరే, ఇప్పుడా తతంగాలు చేసే ఓపిక లేదు నాకు. ఊరుకో నాన్నా”

"బోల్డు గిఫ్టులొస్తయ్యి బాబూ , చేసుకో" అంది పిల్ల ఆగకుండా.

"సూడమ్మా, అక్క...."

"అమ్మలూ, ఎందుకువాణ్ణి ఏడిపిస్తావూ. ఊరుకో"

వెనకనుండి ఎవరో నా కళ్ళుమూశారు. “చెప్పుకోండి.” అంటూ.

అంత చనువుగా ప్రవర్తించేది ఎవరబ్బా ఎంత ఆలోచించినా తట్టలేదు. డా. సుగుణ గుర్తొచ్చింది కానీ సుగుణ ఇలా ఎప్పుడూ చెయ్యలేదు. చెయ్యదు కూడా!

ఓడిపోయానని ఒప్పుకున్నాక కళ్ళ మీద చేతులు తీసి ముందుకొచ్చింది.

సుభద్ర.

ఆ రోజు హాస్పిటల్ లో చూసిన సుభద్రకూ , ఈ సుభద్ర కూ పోలికే లేదు. సెలబ్రిటీ మేకప్ లో వెలిగిపోతోంది.

లేత కనకాంబరం రంగు చీర. చీర మొత్తం నిండుగా వర్క్ చేసి ఉంది. పెద్ద డైమెండ్ నెక్లెస్, ఇదేం పెర్ఫ్యూం అని అడగాలనిపించే చక్కటి పరిమళం.

తను అందంగా ఉన్నానన్న విషయం ఆమెకూ తెలుసని, ఆమె ప్రతికదలికలోనూ తెలిసిపోతోంది.

“హాయ్ ఆంటీ , హౌ ఆర్యూ ?” అంది.

“ఓ.. నువ్వా ? “

“ఎవరనుకున్నారు. చెప్పండి. ఎవరనుకున్నారు ?” అంటూ కారణం లేకుండా పగలబడి నవ్వుతోంది.

“సీత రాలేదా?” అని అడిగి వాళ్ళ నాన్న కూడా వచ్చాడేమోనని చూశాను. ఎక్కడా కనిపించలేదు.

అమ్మయ్య.

దూరంగా ఎవరితోనో మాట్లాడుతున్న గంగాభవాని కబుర్లాపి ఇటే వస్తోంది.

కాగితాలకు చిల్లులు పొడిచే ఆట ఆడతామని డబ్బులు తీసుకుని పిల్లలు వెళ్ళారు.

ఆవిడ కూడా వచ్చి మేమున్న టేబిల్ దగ్గర కూర్చుంది. .

“సీత రాలేదా?” మళ్ళీ అడిగాను

సుభద్ర సందేహించడం చూసి, గంగా భవాని " దాని దగ్గర దాస్తావెందుకే, అదేమైనా పరాయిదనుకున్నావా, చెప్పు" అంది.

తల్లీ కూతుళ్ళు ఒకరి తర్వాత ఒకరు చెప్తున్నారు.

"అంటే ఆంటీ... ఎలా చెప్పాలో కూడా తెలియడం లేదాంటీ.”

“ఈ మధ్యన చాలా జరిగాయాలేమ్మా, పల్లెటూరి వాళ్ళు అమాయకులనుకుంటాము కానీ, వాళ్ళకెన్ని చావుతెలివితేటలుంటాయో ..మనమే పిచ్చోళ్ళం.” అంటూ నన్నుకూడా కలుపుకుని జాలిపడింది.

"తను అన్నయ్యకు తగిన వైఫ్ కాదు ఆంటీ. అన్నయ్య చాలా ప్రిన్సిపిల్డ్. బాగా ఎడ్యుకేటెడ్. ఫస్ట్ మేచ్ పోయిందని ఈ అమ్మాయి విషయం లో తొందరపడ్డాం . "

“ రోజూ రెండుకూరలు, నాన్ వెజ్ దొరుకుతుంటే, తినే యోగం లేదమ్మాయ్ దానికి.”

“ఆ రోజు చూశావుగా ఆంటీ, ఎంత గోల్డ్ పెట్టామో తనకి, మమ్మీ డేడీ ఎంత బాగా చూసుకుంటారో..”

“ మొదటి సంబంధం పోయాక ఎక్కువరోజులు ఆగితే , పిల్లాడిమీద అనుమానమొస్తుందని అందరూ తొందరపెట్టారు. లేనింట్లోనుండి పిల్లను తెచ్చుకోమన్నారు. ఇంటర్ చదువుకుంది. పరిస్థితి అర్థం చేసుకుంటుందని అనుకున్నాము. . కాస్త ఆగి ఉంటే మంచి సమ్మంధాలే వచ్చేయేమో.”

“ అన్నయ్యైతే ఎంత సాఫ్టో మీరు చూశారుకదా. తన బిజినెస్ గొడవలతోనే తనకి సరిపోతుంది.”

“వాడొచ్చేసరికి ఇదెప్పుడూ నిద్రపోతుంటుందమ్మాయ్. ఈ నాటిక్కూడా మీ అంకుల్ తినకుండా నేను భోంచెయ్యనమ్మాయ్."

“మమ్మీ, నీగురించి చెప్పకు. నువ్వో సతీ సుమతివి. అందరూ నీలాగే ఉంటారా.”

‘ఇంతకూ సీత ఎక్కడుంది?’

పిల్లలొచ్చారు.

"అమ్మా, నాకు హండ్రెడ్ రూపీస్ వచ్చినయి. బాబుగాడికేం రాలేదు"

“అమ్మా, నాకు దబ్బు రాలేదు.” ఎదురుగా ఎవరో ఉన్నారని ఏడుపు ఆపుకుంటూ అన్నాడు మా అబ్బాయి.

బేగ్ లోంచి వంద రూపాయలు తీసివ్వబోతే వద్దని తల అడ్డంగా తిప్పాడు.

'సో క్యూట్, సో స్వీట్' లతో ఇంకో అయిదు నిముషాలు గడిచాయి.

వెళ్తానని లేచాను.

★★★★★★★

సీత కేమైందో మళ్ళీ ఏ కబురూ తెలియలేదు. నాన్ననడిగితే ఆయనకేం తెలిసినట్టు అనిపించలేదు. నా పనిలో నేను పడిపోయాను. ప్రాక్టీసు, పిల్లల చదువులు వాటితో సరిపోతోంది. దాదాపు సీత సంగతి మర్చిపోయాను.

ఎంత పని ఉన్నా సరే, వారానికి కనీసం రెండు మూడు రోజులు ఉదయాన్నే వాకింగ్ కు తీసికెళ్తుంది సుగుణ. తను కూడా గైనకాలజిస్టే.

వాకింగ్ మరీ మొనాటనస్ గా ఉందనీ, ట్రెడ్ మిల్ బోర్ కొడుతోందనీ అన్నానని షటిల్ ఆడడానికి బాట్లు తెచ్చింది డా. సుగుణ. వాళ్ళ ఇంటి దగ్గర ఓ స్కూల్ ఉంది. స్కూల్ ఆవరణలో అన్నీ పచ్చని చెట్లు. పిల్లలాడుకోవడానికి అప్పటికే నెట్ అదీ ఉంది. ఆ స్కూల్లో ఆడడానికి వెళ్ళేవాళ్ళం.

నేను రావడం లేటైతే సుగుణ ఆయమ్మలతో కలిసి పూలమొక్కల దగ్గర ఏదో పని చేస్తుండేది. నేను రాగానే పరిగెత్తుకుంటూ వచ్చేది. అరగంట ఆడిన తర్వాత సిమెంట్ బెంచీ కింద కూర్చునేవాళ్ళం. గుబురుగా పూసిన రాధామనోహరాల చెట్టు, గొడుగులా ఉండేది. కాకరకాయ జ్యూసనీ, బీట్ రూట్ జ్యూసనీ, రోజుకో కొత్త రకం జ్యూస్ తెప్పించేది ఇంటిదగ్గరనుండి.

ఎందుకివన్నీ అంటే , 'మనం చేసే ఎక్సర్ సైజ్ ఏమూలకు. తప్పదు తాగు, తాగాల్సిందేనని' బలవంతాన తాగిస్తుంది.

బలవంతాన జ్యూసు తాగుతుంటే, ఇంటి కబుర్లు చెప్తుంది.

“నిన్న బాబీ, శ్యాం ఇద్దరూ వాళ్ళంతట వాళ్ళే స్నానం చేసేశారు.”

“గుడ్. మంచిదేగా.”

“ఏం మంచిది, బాత్ రూం తలుపేసుకోకుండా చేశారు. బెడ్ రూం లోకి నీళ్ళొచ్చాయి. వాళ్ళ బట్టలకోసమని నా చీరలన్నీ కింద పడేశారు. అవన్నీ నీళ్ళలో తడిసిపోయి, వాళ్ళు ఆ తడిలో జారిపడి ఒకటికాదు...ఇల్లంతా గోల గోల ..”

“ఇంట్లో ఎవరూ లేరా?”

“వంటావిడ ఉంది .పనావిడ ఉంది. ఏం లాభం ? ఇద్దరి మాటా వినరు. ”

మా వాళ్ళు ఎంత గొడవచేస్తున్నారోనేనూ చెప్పేదాన్ని .

ఒక మద్దెల వచ్చి ఇంకో మద్దెలతో మొరపెట్టుకున్నట్లే ఉండేది.

ఓ అయిదునిముషాలు మాట్లాడుకున్నామోలేదో, నాకో, సుగుణకో ఇంటిదగ్గర్నుండి కబురొచ్చేది పిల్లలు గొడవ చేస్తున్నారని. పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయేవాళ్ళం.

★★★★★★★

ఆ రోజు ఆదివారం. ఇద్దరం కలిసి ఒక సెమినార్ కు వెళ్ళాలి. షటిల్ ఆడడం అయిపోయాక వాళ్ళింట్లోనే రెడీ అయి వెళ్దామనుకుని ప్లాన్ వేసుకున్నాం. వాన రాబోతోందేమో చల్లటిగాలి విసురుగా వీస్తోంది. స్కూల్లో చెట్లు తెగ ఊగుతున్నాయి. షటిల్ ఆడడం కష్టంగా ఉంది.

హాయిగా కూర్చోవచ్చనుకుంటే, “అదేం కుదరదు, రా జాగింగ్ చేద్దాం.”అంటూ లాక్కెళ్ళింది.

రెండు రౌండులు అయే సరికి “కాళ్ళు నొప్పిగా ఉన్నాయి.” అంటూ సిమెంట్ బెంచీ మీద కూర్చున్నా.

“ సరే, ఒక్క అయిదునిముషాలు టైం ఇస్తున్నా. నేను రెండు రౌండ్స్ అయిపోయేటైం కు నన్ను అందుకోవాలి. అలానే కూర్చున్నావో, ఇవాళ నీకు రెండు గ్లాసుల కాకరకాయ జ్యూస్.” అంటూ సుగుణ వెళ్ళింది .

దూరంగా తననే చూస్తున్నాను. సుగుణ స్పీడుగా పరిగెత్తుతోంది. క్లాసికల్ డాన్సర్. అందగత్తె. మంచి డాక్టర్. సర్జరీగానీ, ఓపీ చూడడం కానీ , కారు నడపడం గానీ ఏదైనా స్పీడే. అంత స్పీడ్ లోనూ, ఒక్క విషయం కూడా మర్చిపోదు.వందమంది పేషంట్లున్నా సరే అలుపూ సొలుపూ లేకుండా చూసెయ్యగలదు. అట్లా అని ఒక్కళ్ళని విసుక్కోగా నేను చూడలేదు.

వాళ్ళాయన కూడా డాక్టరే. నర్సుని ప్రేమించి, ఇంట్లోనే కాపురం పెట్టాడు. అతని ఇంట్లోంచి బయటకొచ్చి, వేరే హాస్పిటల్ పెట్టుకుని పిల్లలతో ఉంటోంది.

ఇంతలో స్కూలు ఆయమ్మ వచ్చి, పరుగులో ఉన్న సుగుణని అందుకుని కంగారుగా ఏదో చెప్తోంది. లేచి నించున్నా.

“హాస్పిటల్ కు వచ్చేయ్” అంటూ సుగుణ కూడా పరుగులాంటి నడక తో వెళ్ళిపోతూ, నాతో చెప్పింది.

ఆయమ్మ తాలూకు బంధువుల అమ్మాయికి ఆరోగ్యం బాగోలేదట. హాస్పిటల్ కు తీసుకొచ్చారు. నేను వెళ్ళేప్పటికి పేషంట్ ని లోపలికి తీసుకెళ్ళారు.

నేను వెళ్ళి సుగుణ రూం లో కూర్చుని పేపర్ చూస్తున్నాను..

ఇంతలో లోపలుండి నర్సు వచ్చి టేబిల్ మీదున్న ఫోన్ లో, ఏదో నంబర్ కు చేసి, “అర్జెంటుగా బీ పాజిటివ్ బ్లడ్ కావాలండీ. క్రాస్ మేచింగ్ సేంపుల్ పంపిస్తాను. పేషంట్ ఫైల్లోకి చూస్తే పేరు సీత, ఏజ్ ..” అంటోంది.

ఫోన్ పెట్టేసి “మేడం ఈ పేషంట్ మీ కేసే , మన స్కూలు ఆయమ్మకు తెలిసిన వాళ్ళంట మేడం. అందుకని ఇక్కడకు తీసుకొచ్చారు.

“వాళ్ళమ్మగారు బయటే ఉంది. మాట్లాడతారా?” నర్సు అడిగింది.

ఫైల్ నా చేతిలోకి తీసుకుని చూస్తే , అది…

సీత ఫైల్.

‘సీత, ఇక్కడికెలా వచ్చిందీ?’

నర్సు బయటికెళ్ళి “ లోపలుంది మీ డాక్టరమ్మ గారే” అని చెప్తోంది . వాళ్ళను తీసుకొచ్చింది.

ఆయమ్మ , ఇంకో ఆడమనిషితో కలిసి లోపలికి వచ్చారు.

“అమ్మా , ప్రమాదమేమీ లేదు కదా ?” ఆయమ్మ వచ్చి అడిగింది.

పక్కనే పేషంట్ తల్లి అనుకుంటా. బాగా కంగారుగా ఉంది. కదిలిస్తే ఏడ్చేసేట్టుగా ఉంది.

“సీత మీ అమ్మాయా?” అడిగాను.

“ అమ్మా బిడ్డను రక్షించండమ్మా.” నా కాళ్ళ మీద పడి ఏడుస్తోంది.

" డాక్టరమ్మ గారు చాలా బాగా చూస్తారు. ఏం భయం లేదు. నువ్వు కూర్చో.” అని ధైర్యం చెప్పి, “ఏమయ్యింది సీతకు?” అడిగాను

ఆమెను లేపి పక్కనే కూర్చోబెట్టింది ఆయమ్మ.

““పిల్లకు మూడోనెల కడుపమ్మా. కడుపు పోటానికని మందుల షాపునుండి బిళ్ళలు తెచ్చాము. నాలుగురోజుల్నుండీ కడుపులో ఒకటే నెప్పి తప్ప పిండం పడలేదు. ఇవాళ పొద్దుట్నుండీ ఒకటే రక్తం పోతంది. ”

సీతకు ప్రెగ్నన్సీ…మూడోనెల అంటే…చివరి నెల ప్రొసీజర్ తో ప్రెగ్నన్సీ వచ్చినట్లుంది.

లోపలికెళ్ళి ఎలా ఉందని సుగుణనడిగితే.

"ఇన్ కంప్లీట్ అబార్షన్. అయిపోయిందిలే. క్లీన్ చేశాను. పేషంట్ బాగానేఉంది. ఎనీమిక్ గా ఉందని బ్లడ్ ఎక్కిస్తున్నాను అంతే." సుగుణ అప్పటికే పని కానిచ్చి లేవబోతోంది.

బయటకొచ్చి సీత వాళ్ల అమ్మతో అంతా బాగానే ఉందని చెప్తే ఊపిరిపీల్చుకుంది.

"ఏమయ్యిందసలు. మందులెందుకు వాడాల్సివచ్చింది? అబార్షన్ చేయించుకోవడం ఎందుకు? ఇంతకూ వాళ్ళ అత్తగారేరీ?"

"ఇంకేం అత్తగారమ్మా? అంతా అయిపోయింది." కళ్ళు తుడుచుకుని చెప్తోంది.

"పెళ్ళిచూపుల్లో తల్లీ , కూతుళ్ళొచ్చి, పిల్లను చూసుకున్నారు. అబ్బాయి పనులుమీద ఎప్పుడూ బొంబాయనీ, మెడ్రాసనీ తిరుగుతుంటాడంట. మేము చూస్తే చాలు పిల్లాడు చూడక్కర్లేదన్నారు. రెండో సంబంధమైనా, ఉండటానికీ , తింటానికీ లోటుండదని, దూరపు చుట్టరికం కూడా ఉందని చేశాము. తీరా పెళ్ళైనాక అమ్మాయిజోలికే వచ్చేవాడుకాదంట . మొదటి సబంధం పిల్లతో కూడా కాపురం చెయ్యలేదనే , వాళ్ళు నాలుగునెల్లకే తెగతెంపులు చేసుకున్నారంట. ఆ సంగతి పెళ్ళైపోయినాక తెలిసింది మాకు. దీనికెట్టాగైనా కడుపు తెప్పిస్తే ఊళ్ళో జనాలకు అనుమానం రాకుండా ఉంటదని, పిల్లని ఆస్పత్రుల చుట్టూ తిప్పారు. మీదగ్గరకు రాక ముందు ఎన్ని ఆస్పత్రులు తిప్పారో లెక్కలేదు. ఆ పరీక్షనీ, ఈ పరీక్షనీ, పిల్ల వొళ్ళు పచ్చిపుండైపోయింది. అయిదు నెలల పాటు మీదగ్గరే వైద్యం చేయించారంట గదా . డబ్బు ఖర్చయినా కడుపు రాలేదని అత్తా ఆడబిడ్డా ఒకటే గోల."

'డబ్బు ఖర్చా, నాన్న పంపించిన కేసుకు డబ్బు ఖర్చా?'

ఓ నిముషం తర్వాత, చెప్పలేక చెప్తున్నట్టు,

"ఇట్టా కడుపు రాదు నీకు, అదంతా నేంజూసుకుంటానని మావ ఎంటబడేవోడంట. మావ ఇసిగిస్తన్నాడని అత్తకు చెప్తే, తల్లీ కూతుళ్ళు, బొంబాయి నుండి అబ్బాయి రాంగనే కబురు పంపిస్తామని, ఇప్పుడికి పుట్టింటికి పోయిరమ్మని పిల్లని బస్టాండింగ్ లో వదిలి పెట్టారు. బస్సులో దొంగలుంటారంజెప్పి, సూత్రం గొలుసు తీసుకుని పసుపుతాడేసి పంపిచ్చారమ్మా."

చెప్తూ చెప్తూ ఏడ్చింది.

"బస్సులో ఒకటే వాంతులు. ఇంటికొచ్చినాక కూడా వాంతులు తగ్గకపోతే, ఇళ్ళ దగ్గర ఆరెంపీ డాక్టర్, మళ్ళా ఒంటేలు పరీక్ష చేసి చూశాడు. గర్భిణీ అని తేలింది. మూడోనెలన కాస్త సలివిడీ అదీ చేసుకుని పిల్లను దిగబెడదావని ఎల్తే, మేము సూపిచ్చిన రోజున గర్భిణీ లేదు. మీ వూరెల్లింతర్వాత కడుపొచ్చింది. మాకేదో అనుమానంగా ఉంది. మాఇంటికి రావొద్దనేశారు.పెద్దమదుసుల్ని పంపిత్తే పిల్ల గుణం మంచిదికాదు. ఇక్కడున్నప్పుడు వావీ వరసా లేకుండా మావ ఎంట బడతంది. ఇక్కడ లేని కడుపు , ఊరికెల్లగానే ఎట్టా వచ్చిందీ. దానికీ ,మాకూ ఏ సంబంధమూ లేదన్నారు."

"మరి ఆ అబ్బాయేమన్నాడు?"

" ఆయబ్బాయికి మేవంటే లెక్కలేదమ్మా. మాతో గానీ, పిల్లతో గానీ మాట్టాడడు. దూరం దూరం బెట్టోవోడు. ఒక్క సారికూడా ఈ పిల్లెటుబోయింది అని కనుక్కుందామన్న ఇది లేదు. అమ్మా , చెల్లీ ఎంత చెప్తే అంత. మీ దగ్గర ఈ విషయాలు ఏమీ చెప్పనీకుండా, ఆడబిడ్డ కాపాలా కాసేదంట."

సుగుణ బయటికొచ్చింది.

"మత్తిచ్చి క్లీన్ చేశాను. సాయంత్రం మత్తువదలగానే తీసుకెళ్ళొచ్చు" అంది.

ఆ రోజంతా అశాంతిగా గడిచింది. మనసు మనసులో లేదు. సీతకు జరిగిన అన్యాయం లో నాకూ భాగముంది.

సాయంత్రం ఒక సారి సీతను చూడడానికి వెళ్ళాను. అప్పటికి లేచి కూర్చుని ఉంది. వాళ్ళ అమ్మ పక్కనే నించుని టీ లో బ్రెడ్ ముంచి ఇస్తుంటే తింటోంది.

ఆ సాయంత్రమే కోలుకున్నా, బలహీనంగా ఉందని సుగుణ రెండు రోజులు హాస్పిటల్ లోనే ఉంచింది.

★★★★★

ఆ రోజు సీత దగ్గరకెళ్ళాను. బాగా కోలుకుందని ఆ రోజు డిస్చార్జ్ చేస్తానని చెప్పింది సుగుణ.

సీత, సీత వాళ్ళమ్మ ఆలోచనలెలా ఉన్నాయో తెలియదు.

ఏది మాట్లాడాలన్నా, నాలో నాకే గిల్టీగా అనిపించింది.

"సీతా, తెలియకుండా చాలా తప్పు జరిగిపోయింది. వాళ్ళను పిలిచి మాట్లాడనా? ఏం జరిగిందో మీ అత్తగారితోనూ , ఆ అబ్బాయి తోనూ వివరంగా చెప్తాను." వీలైతే లీగల్ హెల్ప్ తీసుకుందామని , ఫామిలీ కౌన్సెలింగ్ గురించి, తనకర్థమయేట్టు చెప్పాను.

కాసేపు మాట్లాడలేదు.

“మేడం గారూ , నాకు వాళ్ళింటికెళ్ళాలని లేదు. ఆళ్ళ ఖర్చుతో, పెళ్ళి చేస్తారన్నారని, అమ్మకు తేలిగ్గా ఉంటదని పెళ్ళిచేసుకున్నాను. నాకా పెళ్ళీ వద్దూ, ఏం వద్దు. వాళ్ళని మీరగడం కూడా నాకిష్టం లేదు. ఆళ్ళింట్లో జీతం లేకుండా పనిచేశాను. నేను పని చేసుకుని బతుకుతాను. జీతమిచ్చే పని చూపిచ్చండి చాలు"

సీత మాట్లాడుతుంటే కళ్ళు తడి అయ్యాయి.

సుగుణ కూడా పక్కనే ఉంది. సీత భుజాల చుట్టూ చెయ్యి వేసి " ప్రౌడ్ ఆఫ్ యూ" అంది.

★★★★★★

షటిల్ ఆట తర్వాత, సుగుణ తీరికగా షటిల్ సిమెంట్ బెంచీ మీద కూర్చుంది.

నాకు ఇంటి దగ్గర్నుండి ఫోన్ వచ్చింది. ఫోన్ లోనే పిల్లల తగాదా తీరుస్తున్నాను.

“సుగుణా, నీకీ మధ్య ఇంటిదగ్గర్నుండి ఫోన్లు రావడం లేదే?”

“సీతకు ఇంటర్ లో రెండు సబ్జెక్టులు మిగిలి పోయాయి వచ్చే సెప్టెంబర్ కు కట్టింది. ప్రిపేర్ అవుతోంది. ఎప్పుడూ పుస్తకం పట్టుకునే ఉంటుంది. సీతను చూసి పిల్లలు కూడా చదువుకుంటున్నారు. ఇదివరకటి పిచ్చి అల్లరి బాగా తగ్గింది.”

సీత, సుగుణ వాళ్ళింట్లో ఉంటోంది. వాళ్ళ పిల్లలకు కేర్ టేకర్ గా పనిచేస్తోంది.

“ఏం మిగిలిపోయాయి?”

“ఇంగ్లీషు , ఎకనామిక్స్ , సీతకు హెల్ప్ చేద్దామంటే ఇంగ్లీషు పర్లేదు కానీ ఎకనామిక్స్ లో ఏ బీ సీ డీ లు రావు. మనం బయాలజీ వాళ్ళం కదా!”

“అక్కడికి బయాలజీ, ఫిజిక్సు తెగ గుర్తున్నట్టు” వెక్కిరించాను.

“మర్చే పోయా , ఇవాళ నీకో స్పెషల్ డ్రింక్ తెప్పిస్తున్నాను..”

“ఏంటీ బాదంఫీరా?”

“అంతకన్నా స్పెషల్ . నువ్వు బరువు తగ్గాలని, కాకరకాయ , అల్లం, తేనె కలిపి తయారు చేసిన జ్యూస్. రోజూ పొద్దున్నే తాగితే వెయిట్ తగ్గుతారంట.” అంటుండగానే సుగుణా వాళ్ళ పిల్లలూ సీతా మేమున్న చోటికి వచ్చారు.

సీత సల్వార్ కమీజ్ వేసుకుంది. చక్కటి జడ. కాలేజీ కెళ్ళే అమ్మాయిలా ముచ్చటగా ఉంది. అన్నిటికన్నా, ఏ తాళ్ళూ గొలుసులూ లేని బోసి మెడ మరింత అందంగా ఉంది.

సీత తెచ్చిన జ్యూస్ కూడా  బాగుంది.

(ఈ కథ ముగిసింది.. మరో కథ వచ్చేనెలలో.. )

★★★

Post your comments